క్లుప్తంగా

వృద్ధులకు కంటి ఆపరేషన్లు



కంటి ఆపరేషన్లు చేసుకున్న వృద్ధులతో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రఘు

గంగవరం: మండలంలోని లయన్స్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో పలమనేరు నియోజకవర్గ పరిసర గ్రామాల నుంచి కొంతమంది వృద్ధులు కంటి ఆపరేషన్లను ఎంపికయ్యారు. ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి సహకారంతో వారికి కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాలలో ఉచితంగా ఆపరేషన్లు చేయించారు. కంటి ఆపరేషన్ల అనంతరం గురువారం వారందరినీ లయన్స్ క్లబ్‌కు తీసుకెళ్లారు. కొన్నాళ్ల పాటు కంటి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్లబ్ అధ్యక్షుడు రఘు వారికి వివరించారు.

ఆర్టీసీ బస్సు ఢీ మోటార్ సైక్లిస్టుకు గాయాలు



గాయపడ్డ బాబు

సదుం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డ సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. పలమనేరు మండలం టీ.వడ్డూరుకు చెందిన బాబు స్వంత పనుల నిమిత్తం పీలేరుకు ద్విచక్ర వాహనంలో వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. మండలంలోని చింతలవారిపల్లె పూలకుంట సమీపంలో ఆర్టీసీ బస్సు అతడిని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని పీలేరులో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలించారు.

చంద్రుడిపై కోదండరాముడి వైభవం



చంద్రప్రభ వాహనంపై కొలువైన శ్రీరామచంద్రుడికి మొక్కుతున్న భక్తులు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి చంద్రప్రభ వాహన సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి వేదపండితులచే అభిషేకం చేశారు. సుగంధపరిమళ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్య కైంకర్యాలను సమర్పించారు. భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఉభయదారులు కోదండరెడ్డి కుటుంబ సభ్యులచే వేదపండితులచే స్వామికి భక్తిప్రపత్తులతో తిరుమంజనం, ఉభయదారులు మదన్‌మోహన్‌రెడ్డి కుటుంబసభ్యులచే స్వామికి పాలాభిషేకం చేయించి మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో స్వామికి ఊంజలిసేవ

శ్రీ కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామికి భక్తిశ్రద్ధలతో ఊంజల్ సేవ నిర్వహించారు. స్వామికి పూజాసామగ్రి, పట్టువస్త్రాలు, సుగంధ పుష్పాలు, ప్రసాదాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. వేదపండితులు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. వేదమంత్రాలు పఠనం చేస్తూ ఊంజల్ సేవను వైభవంగా నిర్వహించారు. భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దీనికి ఉభయదారులుగా సాంబయ్య కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

అన్నదానం ట్రస్టుకు విరాళం



చెక్కు అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు


కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని అన్నదానం ట్రస్టుకు గురువారం చిత్తూరుకు చెందిన రమక్క కుటుంబ సభ్యులు చెక్కు రూపంలో రూ.1,00,116 విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం అధికారులు దాత కుటుంబ సభ్యులకు స్వామి వారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

4న విద్యుత్ అదాలత్

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం జులై 4న విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో రూరల్ ఈఈ హరి తెలిపారు. పైపల్లె, చిత్తూరు రూరల్స్–1 సబ్‌డివిజన్ల పరిధిలోని బంగారుపాళెం, యాదమరి, ఐరాల, తవణంపల్లె మండలాల పరిధిలోని వినియోగదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

పాలన ఇక్కడ.. పనులకు అక్కడ..!

- పెద్దపంజాణి మండల ప్రజలకు ఇదో సమస్య
- పదికి పైగా శాఖల సేవల కోసం పుంగనూరుకు పరుగు!
- కేవలం ఓట్లు వేయడానికే పలమనేరు నియోజకవర్గం
- సేవలన్నీ నియోజకవర్గ కేంద్రంలోనే ఉండాలని డిమాండ్
- ఇదీ పలమనేరు ఎమ్మెల్యే సొంత మండల ప్రజల నివేదన



పలమనేరు నియోజకవర్గ కేంద్రం వ్యూ

పలమనేరు: సాధారణంగా ఏదైనా నియోజకవర్గంలోని మండల ప్రజలు తమకు పాలనా పరంగా అవసరమైన ప్రభుత్వ సేవల కోసం మండల కేంద్రానికో, నియోజకవర్గ కేంద్రానికో వెళ్లడం పరిపాటి. అయితే పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి మండల ప్రజలు మాత్రం చిత్రమైన పరిస్థితి ఎదుర్కొంటున్నారు. వివిధ శాఖల సేవల కోసం పలమనేరుకు కాకుండా పుంగనూరు నియోజకవర్గానికి పరుగులు తీయాల్సిన వస్తోంది! గత పదేళ్ల ఆ మండల ప్రజలు ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. తాము పలమనేరు నియోజకవర్గంలో ఓటర్లైనప్పటికీ పనులు కావాలంటే పుంగనూరుకు వెళ్లవలసి వస్తోందని వాపోతున్నారు.

ఇదీ నియోజకవర్గ చరిత్ర

పలమనేరు తాలూకాను 1911లో మదరాసు రాష్ట్రంలోని నార్త్ ఆర్కాడ్ నుంచి విడదీసి చిత్తూరు జిల్లాలో విలీనం చేశారు. 1950లో మైసూరు రాష్ట్రం నుంచి 8 గ్రామాలను, చిత్తూరు తాలూకా నుంచి 195 గ్రామాలను, బంగారుపాళ్యం సబ్ తాలూకాగా ఏర్పాటు చేసి ఈ నియోజకవర్గంలోకి కలిపారు. 1952లో పలమనేరు అసెంబ్లీ నియోజకవర్గంగా రూపాంతరం చెందింది. 2009 అసెంబ్లీ స్థానాల పునర్విభజనలో బంగారుపాళ్యం మండలాన్ని పూతలపట్టు నియోజకవర్గంలో కలిపి, కుప్పం నియోజకవర్గంలోని వి.కోట మండలంలోని కొన్ని గ్రామాలను విడదీసి ఆ మండలాన్ని పలమనేరు నియోజకవర్గంలో కలిపారు. దీంతో పాటు పుంగనూరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి మండలాన్ని కూడా దీనిలో కలిపారు. నియోజకవర్గంలో పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె, వీ.కోట మండలాలుగా ఉన్నాయి. నియోజకవర్గంలో మొత్తం జనాభా 3లక్షలకు పైచిలుకు ఉండగా, మొత్తం ఓటర్లు 2,67 లక్షలు ఉన్నారు.

వివిధ శాఖల సేవలు పుంగనూరులోనే..!

పలమనేరులో ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయం ఉంది. అయితే పెద్దపంజాణి ప్రజలకు మాత్రం పుంగనూరు డివిజన్‌గా ఉంది. పలమనేరు ఐసీడీఎస్ కార్యాలయం కాకుండా వీరు పుంగనూరు కార్యాలయానికి వెళ్లవలసి వస్తోంది. ఇక రవాణాశాఖ కార్యాలయం పలమనేరులోనే ఉన్నా వీరు మాత్రం మదనపల్లెకు వెళ్లాలి. అటవీశాఖ కార్యాలయం సైతం పుంగనూరు రేంజిలో పెద్దపంజాణి ఉంది. ఇక ఎక్సైజ్‌శాఖ కార్యాలయం కూడా పుంగనూరే. సబ్ రిజిస్ట్రార్, సబ్‌ట్రెజరీ, వాణిజ్య పన్నులు, సివిల్ సప్లైస్, న్యాయస్థానాలు.. ఇలా పదికి పైగా కార్యాలయాల సేవలకు పుంగనూరు నియోజకవర్గ కేంద్రానికి పరుగులు తీయాల్సి వస్తోంది. ఈ శాఖల సేవలన్నీ తమ నియోజకవర్గ కేంద్రమైన పలమనేరులోనే లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ మండల ప్రజలు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి ఈ సమస్య తెలియంది కాదు. ఆయన మంత్రిగా ఉన్నప్పుడు కూడా ఆయన దృష్టికి ఈ సమస్యను నివేదించారు. సొంత మండలమైన పెద్దపంజాణి సమస్యను ఇకనైనా ఆయన పరిష్కరిస్తారా!? అనే ఆశాభావంతో మండల ప్రజలు ఎదురుచూస్తున్నారు.

ఓటుకు పలమనేరు.. పనులకు పుంగనూరు!



ఎవరనైనా అడిగితే మాది పలమనేరు నియోజకవర్గమని చెబుతాం. కానీ పలమనేరులో ఏ ఆఫీసుకెళ్లినా మీరిక్కడ కాదు పుంగనూరుకుపోండని చెబుతారు. మా మండలాన్ని పలమనేరులో కలిపినప్పటినుంచి పదేళ్లుగా ఇదే సమస్య. జిల్లా కలెక్టరైనా మా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తే అదే పదివేలు.

–రాజారెడ్డి, అప్పినపల్లె, పెద్దపంజాణి మండలం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న సర్పంచ్ రమేష్ బాబు

పెద్దపంజాణి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పుంగనూరు డివిజన్ మలేరియా యూనిట్ అధికారి గంగయ్య కోరారు. రెండు రోజుల క్రితం మండలంలోని బసవరాజు కండ్రిగకు చెందిన ఓ అమ్మాయి డెంగీ బారిన పడినట్టు నిర్ధారణ అయిన విషయం తెలుసుకుని గురువారం గ్రామంలో పర్యటించారు. స్థానిక సర్పంచ్ రమేష్ బాబుతో కలసి పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, ప్రజలు పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, అలాగే దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఐదు రోజులకు పైబడి జ్వరం తగ్గని పక్షంలో వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో డెంగీ నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాయలపేట పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ గీతాంజలి, ఏఎన్‌ఎం సుజాత, ఆశావర్కర్ లలిత పాల్గొన్నారు.

బహు వార్షిక పశుగ్రాసాలతోనే పాల దిగుబడి





పలమనేరు సమీపంలోని పశు పరిశోధన కేంద్రం వద్ద పెంచిన అలసంద, లూసెర్న్ పశు గ్రాసాలు



డాక్టర్ వేణు

పలమనేరు: పాడి ఆవుల్లో పాల ఉత్పత్తి పెరగాలంటే బహువార్షిక పశుగ్రాసాలను రైతులు పెంచుకోవడం చాలా ఉత్తమం. సంకర జాతి పాడి ఆవులకు పచ్చిమేత అవసరం చాలా ఉంది. కేవలం ఎండు గడ్డితోనే అధిక పాల ఉత్పత్తి సాధ్యం కాదు. పలమనేరు నియోజకవర్గంలోని పాడి రైతులు బహువార్షిక పశుగ్రాసాలను పెంచుకుంటే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చునని ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వేణు చెప్పారు. నీటి పారుదల సౌకర్యం ఉన్న రైతులు హైబ్రీడ్ నేపియర్, లూసర్న్ పశుగ్రాసాన్ని ఏడదంతా సాగుచేసుకోవచ్చు. ఒకే పంటకైతే మొక్కజొన్న ఉత్తమం. మెట్ట ప్రాంతాల్లో అయితే జొన్న, సజ్జ ఎంతో మేలు. చౌడు భూముల్లో రోడ్స్, మిశ్రమ పంటగా అలసంద, చెట్ల నీడల్లో గిని, స్టైలో, నీరు నిల్వ ఉండే భూములో పారా గడ్డి, బంజర భూముల్లో అంజన్, సైలేజ్ కోసం మొక్కజొన్న, సజ్జ, నేపియర్ ఎంతో ఉపయోగదాయకం. ఏక వార్షిక పశుగ్రాసాలైన జొన్న, మొక్కజొన్న, సజ్జ, ఓట్సు, బర్సీమ్, జనుము, పిల్లి పెసర, అలసందలు ఏ కాలంలోనైనా సాగు చేసుకోవచ్చు. ఇక బహు వార్షిక పశుగ్రాసాలైన హైబ్రీడ్ నేపియర్, పారాగడ్డి, గిని, లూసర్న్, అంజన్, దీననాథ్, స్టైలో హెమాటా, హెడ్జ్ లూసర్న్, స్టైలో స్కాబ్రాలు ఎండు మేతగా, పచ్చి మేతగా కూడా ఉపయోగించుకోవచ్చని సైంటిస్ట్ వివరించారు. ఈ పశుగ్రాసాలను రైతులు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక పాల ఉత్పత్తి సాధ్యమేనని, మరోవైపు దాణా ఖర్చు కూడా తగ్గించుకోవచ్చని ఆయన సూచించారు. ఇతర వివరాల కోసం పలమనేరు సమీపంలోని కేటిల్ ఫామ్ వద్దనున్న పరిశోధన కేంద్రాన్ని సంప్రదించి రైతుల అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు.

పదవుల కోసం తెలుగు తమ్ముళ్ల ఎదురుచూపులు!

- ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే ప్రసన్నంలో పలువురు నేతలు
- ఫలాన పోస్టు తనకేనంటూ పట్టుబడుతున్న ఆశావహులు
- పార్టీ కోసం కష్టపడిన వారికే ఇవ్వాలంటున్న శ్రేణులు



పలమనేరు: మొన్నటి వరకూ ఎన్నికల బిజీలో గడిపి స్థానికంగా టీడీపీ గెలుపుకోసం ఆ పార్టీ నేతలు కష్టపడ్డారు. టీడీపీ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో స్థానికంగా ఇక్కడ నామినేటెడ్ పదవులపై నాయకులు కన్ను పడింది. దీంతో ఇప్పటి నుంచే స్థానిక ఎమ్మెల్యే కనుసన్నల్లో మసలుతూ ఆయన్ను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు ఆశావహులు. అయితే స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మనసులో ఏ పదవిని ఎవరికి కట్టబెట్టాలో ఓ క్లారిటీ ఉన్నప్పటికీ ఇక్కడున్న ఆశావహులు మాత్రం ఆ పదవి తమకేనంటూ ఆశల పల్లకిలో ఊరేగుతున్నారు. తనకు ఫలానా పదవి వచ్చినట్టేనంటూ అప్పుడే విందులు సైతం చేసుకుంటున్నారు!

బరిలో పలువురు ఆశావహులు

నియోజకవర్గంలోని ప్రొటోకాల్ కలిగిన మార్కెట్ కమిటీ చైర్మన్ నామినేటెడ్ పదవుల్లో కీలకమైంది. ఇందుకోసం అన్ని మండలాల్లో భారీ డిమాండ్ నెలకొంది. త్వరలో పట్టణ సమీపంలోని క్యాటిల్‌ఫామ్ వద్ద ఇంటిగ్రేటెడ్ మార్కెట్ రానున్న నేపథ్యంలో అందరి కన్ను ఏఎంసీ చైర్మన్ పదవిపై పడింది. ఇక సింగిల్‌విండో అధ్యక్షులు పోస్టులు ఎనిమిది వరకూ ఉన్నాయి. ఇవిగాక స్థానిక ఏరియా ఆస్పత్రి చైర్మన్, సభ్యులు, పట్టణంలోని పలు ఆలయాల కమిటీ చైర్మన్లు నామినేటెడ్‌గానే ఇవ్వాల్సి ఉంది. దీంతో వారి స్థాయిని బట్టి అప్పుడే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. మరోవైపు జూలై 2న స్థానిక ఎమ్మెల్యే పుట్టినరోజు కావడంతో ఆ కార్యక్రమాన్ని సైతం ఎవరివారు గొప్పగా చేసి ఆరునూరైనా ఆయన దృష్టిలో పడాలని ఆరాటపడుతున్నారు. ఏదేమైనా నాయకులు మాత్రం ఆశ చావకుండా వారివారి ప్రయత్నాల్లో నిమగ్నం కావడం కొసమెరుపు.

కరపత్రాల ఆవిష్కరణ



హిందూ సామ్రాజ్యోత్సవ యాత్ర కరపత్రాలు విడుదల చేస్తున్న సభ్యులు

పుంగనూరు: పట్టణంలో ఎన్ఎస్ పేటలోని శ్రీప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఈనెల 30న తలపెట్టిన హిందూ సామ్రాజ్యోత్సవ యాత్రకు సంబంధించి కరపత్రాలను గురువారం చెంగాలపురంలో హిందూయూత్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. వారు మాట్లాడుతూ, భారతావనిని చైతన్యపరిచేందుకే ఈ యాత్ర ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. హిందూవులు ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండండి




వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు: విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మురళీమోహన్ సూచించారు. మండలంలోని చిన్నబండపల్లి గ్రామంలో గురువారం డయేరియా బారిన పడిన 8 మందిని కలిసి పరామర్శించారు. ఎలాంటి ఆందోళనకు గురికావద్దని భరోసానిచ్చారు. విషజ్వరాలు సోకిన వారికి అవసరమైన మందులను అందజేయాలని వైద్యాధికారులకు తెలియజేశారు. అనంతరం పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. వర్షాకాలంలో విష జ్వరాలు పెరుగుతాయని, ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల పట్ల జాగ్రత్త వహించి వారికి చికిత్సలు అందజేయాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.


విద్యాసామగ్రి వితరణ

ఐరాల: మండలంలోని 35 యర్లంపల్లె ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం వాసు ట్రస్ట్ నిర్వాహకులు రాజారాం, సుబ్రమణ్యం, ఈశ్వర్, ఎంఈఓ దామోదర్‌నాయుడు ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ, విద్యార్థులకు అవసరమైన వాటిని దాతలు ఇవ్వడం అభినందనీయమని, దాతల నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్ఠలు తేవాలన్నారు. అనంతరం దాతలను హెచ్‌ఎం అజిత, సర్పంచ్ మల్లీశ్వరి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు లత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఐఆర్‌ఎం విద్యార్థుల ప్రతిభ



శ్రేయ



మోనిక



రజని



మేఘన

కుప్పం: పట్టణంలోని ఐఆర్‌ఎం కళాశాల విద్యార్థులు ఇంటర్ మెదటి సంవత్సం ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు కళాశాల చైర్మన్ దయానిధి తెలిపారు. ఎంపీసీ గ్రూపులో శ్రేయ 464, మోనిక 443 మార్కులు, సీఈసీ విభాగంలో రజని 456 మార్కులు, బైపీసీలో మేఘన 401 మార్కులు, అలాగే సీఈసీ విభాగంలో ప్రవల్లిక 450, ఎంఈసీలో మోహిత్ 440 మార్కులు సాధించినట్టు తెలియజేశారు. విద్యార్థులకు ఆయన అభినందించారు.

జలధితో జాతర పరిసమాప్తం



గ్రామంలో అమ్మవారి శిరస్సు ఊరేగింపు

పెద్దపంజాణి: బాణసంచా మోత.. బ్యాండ్ మేళం.. విచిత్ర వేషధారణలతో భక్తులు..సాంస్కృతిక కార్యక్రమాలతో రాయలపేట గ్రామం హోరెత్తింది. పటాలమ్మ గంగమ్మ జాతరలో భాగంగా మూడోరోజు గురువారం అమ్మవారి జలధి కోలాహలంగా నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద నుంచి శిరస్సు మెరవణిని రాములవారి గుడి వీధి, హైస్కూల్ వీధి మీదుగా డప్పు వాయిద్యాల హోరు నడుమ గ్రామం చివరి వరకూ ఊరేగించారు. అమ్మవారి భక్తులు ప్రత్యేక పూజలు చేయడంతో పాటు కర్పూర హారతులిచ్చి, భారీగా కొబ్బరి కాయలు కొట్టి, మొక్కులు చెల్లించారు. అనంతరం అమ్మవారి జలిధి కార్యక్రమాన్ని నిర్వహించారు. చివరగా ఆలయం వద్ద హుండీ ఆదాయం లెక్కింపు నిర్వహించి అమ్మవారి చీరలను వేలం వేశారు. మూడు రోజుల జాతరను విజయవంతం చేసిన గ్రామస్తులకు, పోలీసులకు కార్యనిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు...

బుధవారం రాత్రి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాలను తిలకించేందుకు పెద్ద ఎత్తున జనం రావడంతో ఆలయం పరిసరాలు జనసంద్రంగా మారాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పెద్దపంజాణి పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

జీఓ నంబర్ 117ను రద్దు చేయాలి : ఎస్టీయూ



సమావేశంలో మాట్లాడుతున్న మండల శాఖ అధ్యక్షులు బాబురెడ్డి

పెద్దపంజాణి: విద్యావ్యవస్థకు గొడ్డలిపెట్టుగా ఉన్న 117 జీఓను వెంటనే రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎస్టీయూ పెద్దపంజాణి మండల శాఖ అధ్యక్షులు బాబురెడ్డి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ మాట్లాడారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసి ప్రాథమిక పాఠశాల వ్యవస్థను రక్షించాలన్నారు. ఉన్నత పాఠశాలలో సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని ప్రవేశ పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాబురెడ్డి, గురుప్రసాద్ మాట్లాడారు. మండలంలో ఉపాధ్యాయుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో పుంగనూరు డివిజన్ కన్వీనర్ నారాయణస్వామి, ఆర్థిక కార్యదర్శి శివప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ అంజాద్ అలీఖాన్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలమనేరులో ‘నేను బడికి పోతా’ ర్యాలీ



విద్యార్థులతో ర్యాలీ చేస్తున్న ఉర్దూ ఉన్నత పాఠశాల టీచర్లు

పలమనేరు:స్థానిక ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులతో టీచర్లు ‘నేను బడికి పోతా’ ర్యాలీని గురువారం పట్టణంలో నిర్వహించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఎల్ఎస్ కో–ఆర్డినేటర్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ, ఆరు నుంచి 14 ఏళ్ల బాల బాలికలు బడికి రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యంగా ముస్లిం, మైనారిటీ పిల్లలు బడికి మానకుండా వచ్చేలా వారి తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాల లబ్ధిని సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలసుందరం, హెచ్‌ఎం శ్రీనివాసులు, సీఆర్సీ సంయుక్త కార్యదర్శి మునాఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డయేరియా నియంత్రణకు ప్రత్యేక కమిటీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ శంకర్

గుడుపల్లె: గ్రామాలలో డయేరియా వ్యాధి నియంత్రణకు మండల స్థాయిలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని ఈఓపీఆర్‌డి శంకర్ కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డయేరియా కమిటీని ఏర్పాటు చేశారు. సభ్యులుగా తహసీల్దార్, ఎంపీడీఓ, డాక్టర్లతో ఏర్పాటు చేసిన ఈ కమిటీ గ్రామస్థాయిలో పంచాయతీ అధికారులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు డయేరియా నిర్మూలనపై అవగాహన కల్పించాలని కోరారు. గ్రామాలలో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని, అలాగే మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చూడాలన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి వారం గ్రామాలలో ఈ కమిటీ పర్య వేక్షిస్తూ క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఇంటర్ ఫలితాల్లో టాపర్లకు నజరానా!

- ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున నగదు బహుమతి
- డీఎఫ్ఓ చేతుల మీదుగా నలుగురికి పంపిణీ



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి

పలమనేరు: పట్టణంలోని మధు, శ్రీవాణి కళాశాలల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.లక్ష నజరానాను గురువారం స్థానిక కళాశాలలో చిత్తూరు డీఎఫ్ఓ చైతన్యకుమార్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. రెండ్రోజుల క్రితం విడుదలైన ఇంటర్ ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో ఎంపీసీ గ్రూపులో 470 మార్కులకు 466 మార్కులను సాధించిన కరిష్మా, చేతన, బైపీసీలో 440కి 436 సాధించిన అల్ఫిన్, సీఈసీలో 500లకు 486 సాధించిన పిజ్జా అంజుమ్‌లకు ఈ మొత్తాన్ని అందజేశారు. డీఎఫ్ఓ మాట్లాడుతూ, ఇంత భారీ మొత్తంలో నగదు బహుమతులందించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. టాపర్లుగా అమ్మాయిలే ఎక్కువగా ఉన్నారని అబ్బాయిలు సైతం బాగా చదివి టాపర్లుగా నిలవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి రెడ్డి మాట్లాడుతూ, ఇకపై ఏటా టాపర్స్‌కు ఇలాగే నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామని ప్రకటించారు. ప్రతి ఒక్కరూ బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీవాణి, వైస్ ప్రిన్సిపాళ్లు ఆనంద్‌రెడ్డి, గోపీనాథ్, సుబ్రమణ్యం రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.